క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా తిరువీధి



సింహగిరి మాడవీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: మీన సంక్రమణాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజింపజేశారు. సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. దివ్యప్రబంధ పారాయణాన్ని స్థానాచార్యులు, అధ్యాపకులు పఠించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వేంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

వైభవంగా శ్రీపుష్పయాగం



సీతారాముల ఉత్సవమూర్తులు

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో జరుగుతున్న వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శ్రీ పుష్పయాగాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి వేదికపై వేంజింపజేశారు. పలు రకాల పుష్పాలు, ద్వాదశ ఆరాధనలతో శ్రీ పుష్పయాన్ని ఘనంగా నిర్వహించారు.

పెద్ద మనసు చాటుకున్న కార్మికులు



మృతుడు నాగరాజు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కార్మికులు

సబ్బవరం: తమతో పనిచేసిన వ్యక్తి మృతి చెందడంతో తోటి కార్మికులంతా కలిసి బాధిత కుటుంబానికి రూ.1.70లక్షలు ఆర్థిక సాయం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంకు చెందిన గొర్లి నాగరాజు ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందాడు. విశాఖ స్టీల్ ప్లాంట్ సెంట్రల్ స్టోర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికులంతా కలిసి రూ.1.70 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. మృతునికి భార్య వాణి, పిల్లలు హిందు,శిరీష ఉన్నారు. కార్యక్రమంలో కర్రి శ్రీను,గొర్లి నాగరాజు,జెట్టి నాయుడు,పోట్నూరి ప్రసాద్,మామిడి వరహలు,ఎర్ర సోంబాబు,కంద రాజు,చిన్ని సోంబాబు,కనకరావు పాల్గొన్నారు.


ఘనంగా నీలాంబరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలోని ఆలయంలో నీలాంబరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలతో ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్ రాజ్, పార్టీ నాయుకులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత సత్యనారాయణ రాజుకు బాండ్ అందజేస్తున్న సూపరింటిండెంట్ విక్రమ్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని ఎండాడకు చెందిన వాడపల్లి వీరవెంకట సత్యనారాయణ రాజు రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ప్రోటోకాల్ సూపరింటిండెంట్ విక్రమ్ బాండ్ అందజేశారు.



ప్రారంభానికి నోచుకొని కలపాక మంచినీటి పథకం

వేసవి ఆరంభంతో కలపాక, నాయుడుపాలెం పంచాయతీల్లో పలు గ్రామాల ప్రజలు తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. ఆయా గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన మంచినీటి పథకాలు ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోక పోవడం, ప్రారంభించిన పథకాలకు బోర్ల నుంచి నీరందక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే రానురానూ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందోనని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

-పరవాడ

- తాగునీటి ఇబ్బందులు
- పరవాడ మండలంలో గుక్కెడు నీటి కోసం హైరానా
- పనిచేయని తాగునీటి పథకాలు
- కలపాక, నాయుడుపాలెంలో అడుగంటిన భూగర్భజలాలు

వేసవి గడిచేదెలా..


మండలంలో కలపాక, నాయుడుపాలెం శివారు చాకలిపేట గ్రామాల్లో తాగునీటికి ప్రజలు కటకటలాడుతున్నారు. కలపాక గ్రామంలో 2022లో సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సాయంతో రూ.22.50లక్షలతో 40 వేల కెపాసిటీ కలిగిన మంచినీటి పథకాన్ని మంజూరు చేసింది. 2023 నాటికి నిర్మాణ పనులు కూడా పూర్తి చేశారు. రెండేళ్లు కావస్తున్న గ్రామీణ నీటి సరఫరా విభాగ అధికారులు ఎందుకు ప్రారంభించడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. మంచినీటి పథకం ప్రారంభానికి పైపులైన్లు పూర్తి కాలేదన్న సాకులు చూపిస్తున్నారు. పూర్వం నిర్మించిన వాటర్ ట్యాంకు పై ప్రస్తుతం ప్రజలు ఆధారపడి దప్పిక తీర్చుకుంటున్నారు.

అడుగంటిన భూగర్భ జలాలు

వేసవి ఆరంభం కావడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. వాటర్ ట్యాంకుకు తగినంత నీరందకపోవడం వలన ప్రజలకు సమీపంలోని వెన్నలపాలెం, పి.బోనంగి ఆర్వో ప్లాంట్లపై ఆధారపడి దప్పిక తీర్చుకొంటున్నారు. గ్రామంలో బోర్లన్నీ కలుషితం కావడంతో ఆ నీరు ఎందుకు పనికి రావడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు కూడా ఆరేళ్లుగా మరమ్మతులతో మూలకు చేరింది. ప్రస్తుతం పాత వాటర్ ట్యాంకు నుంచి అడపదడప సరఫరా అవుతున్న తాగునీటి కోసం పడిగాపులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి కాలేదు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు పూర్తి కాలేదు. నాయుడుపాలెం శివారు కొరంగిపాలెంలో ఎన్టీపీసీ సౌజన్యంతో రూ.11 లక్షలతో నిర్మించిన 10 వేల లీటర్ల కెపాసిటీ కలిగిన మంచినీటి పథకం కొంతకాలం పనిచేసినా వాటర్ సోర్స్ లేక రెండేళ్లుగా మూలకు చేరింది. దీంతో కోరంగిపాలెం, చాకలిపేట, మంగప్పయ్యగారి గ్రామ ప్రజలకు తాగు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. కొరంగిపాలెంలో నిర్మించిన మంచినీటి పథకానికి తాగునీరందించడానికి వివిధ ప్రాంతాల్లో మూడు బోర్లను ఏర్పాటు చేశారు. అయితే వాటి నుంచి నీరు తగినంత లభ్యం కావడం లేదు. ప్రస్తుతం ఈ గ్రామాల ప్రజలకు మరోక వాటర్ ట్యాంకు నుంచి రోజు తప్పించి రోజు తాగునీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అవసరాలు తీరడం లేదు. మున్ముందు ఎండల తీవ్రత అధికమైతే భూగర్భ జలాలు మరింత అడుగట్టి గొంతు తడుపుకోవడానికి కూడ నీరు దొరికే అవకాశం ఉండదని ప్రజలు భావిస్తున్నారు. ఎన్టీపీసీ నిధులు రూ.18 లక్షలతో కొండవానిపాలెంలో చేపట్టిన మంచినీటి పథకం ఇంకా నిర్మాణ దశలో ఉంది. ఎండలు ముదిరితే మెట్టపాలెం గ్రామ ప్రజలకు తాగునీరందించే బోరులో నీరు ఇంకిపోయే ప్రమాదం ఉందని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెన్నలపాలెం శివారు హనుమాన్ కాలనీలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయని కాలనీ ప్రజలు చెపుతున్నారు.



నిరుపయోగకంగా ఉన్న కొరంగిపాలెం మంచినీటి పథకం



కొరంగిపాలెంలో నీరింకిపోయిన గొట్టపు బావి

తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం



రెండేళ్లుగా తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం. మంచినీటి పథకం సమీపంలో ఉన్నప్పటికీ కష్టాలు తప్పడం లేదు. వేరోక మంచినీటి పథకం నుంచి రెండు రోజులకొకసారి నీటి సరఫరా చేస్తున్న ఎటూ చాలడం లేదు. తాగు నీటి పథకాన్ని పూర్తి స్థాయిలో వినియెగంలోకి తీసుకురావాలి.

-పిడిమి నేస్తాలమ్మ, చాకలిపేట

మంచినీటి పథకాన్ని ప్రారంభించాలి



లక్షల ఖర్చుతో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం మూడేళ్ల అయినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో తాగు నీటి కోసం పరుగులు తీయాల్సి వస్తోంది. జల్‌జీవన్ మిషన్ పనులు కూడా పూర్తి కాలేదు. ఇంటింటికీ కుళాయిలు పనులు పూర్తి చేసి తాగునీరందివ్వాలి. బోర్లన్నీ కలుషితమయ్యాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది.

- పప్పుల సత్యవతి, కలపాక

తాగునీటి సమస్యలు పరిష్కరిస్తున్నాం

మండలంలో ప్రస్తుతానికి తాగునీటి ఇబ్బందులు లేవు. ఎక్కడైన మంచినీటి పథకాలు, బోర్లు మరమ్మతులైతే వెంటనే పరిష్కరిస్తున్నాం. కలపాక మంచినీటి పథకం పైపులైన్ పనులు పూర్తయితే త్వరలో నీటిని సరఫరా చేస్తాం. కొరంగిపాలెం మంచినీటి పథకానికి తాగునీరందించడానికి త్వరలో కొండవానిపాలెంలో కొత్త బోరును నిర్మించనున్నాం. పైపులైన్ పనులు కొనసాగుతున్నాయి. అవి పూర్తయితే ఆ గ్రామానికి తాగునీటి సమస్యలుండవు.

-షణ్ముఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

ముత్యమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ



పండగ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి పండగను ఈ నెల 18న వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పండగ పోస్టర్‌ను గ్రామ పెద్దలతో కలసి శనివారం ఆవిష్కరించారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పండగ రోజు వేకువజాము నుంచి అమ్మవారి దర్శనాలు కల్పిస్తామన్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కలిప్తున్నామన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి వెంకటపతిపాలెంలో సినీ డూపర్స్, నాయుడుపాలెం, పాత రాజానపాలెం గ్రామాల్లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, వాడచీపురుపల్లిలో భాగవతం, హస్తినాపురంలో బుర్రకథ, తాడిచెట్లపాలెంలో వెంకటరమణమూర్తి పాట, వాడచీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సిమ్మన్నగారి గ్రామంలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో 17న వాడచీపురుపల్లిలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పండగ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పోస్టర్ ఆవిష్కరణలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ సర్పంచ్ కూండ్రపు సన్యాసి నాయుడు, మాజీ ఎంపీటీసీలు కూండ్రపు శ్రీరామ్మూర్తి, కె.చిన్నంనాయుడు, ఆలయ పూజారి కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాపయ్యరాజుపాలెంలో ఏక్తా ధ్యానం

పెందుర్తి: పాపయ్యరాజుపాలెం బ్రహ్మర్షి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ధ్యాని విజ్ఞాని ప్రాజెక్ట్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏక్తా ధ్యానం నిర్వహించనున్నట్లు కేంద్రం ప్రతినిధులు తెలిపారు. ధ్యాన మాస్టర్ శరగడం తులసి ఆధ్వర్యంలో ఉదయం 6 నుంచి ఉదయం 7 వరకు, సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్యానంపై శిక్షణ, అవగాహన ఉంటుందని తెలిపారు.

అంకితభావంతో పనిచేసి భక్తుల మన్ననలు పొందండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో సుబ్బారావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చేభక్తులకు అంకితభావంతో సేవలందించాలని, తద్వారా వారి మన్ననలు పొందాలని సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దేవస్థానం ఉద్యోగులకు సూచించారు. రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాల మేరకు దేవాలయాల్లో పాటించాల్సిన కీ పెర్ఫార్మెన్స్ ఇన్‌డికేటర్స్‌పై శనివారం దేవస్థానం ఈవో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. దేవదాయశాఖ జారీచేసిన సూచనలను ఉద్యోగులకు వివరించారు. భక్తుల సందర్శన సమయాల్లో దేవాలయాల్లో చేయాల్సిన పలు సౌకర్యాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. స్వామివారి లడ్డు, పులిహోర ప్రసాదం ఎప్పటికప్పుడు అందించే విషయంపై సమీక్ష నిర్వహించారు. నిత్యం పులిహోర, లడ్డు ప్రసాదాల నాణ్యత, రుచిని అధికారులు పరిశీలించిన తర్వాతే భక్తులకు విక్రయాలు జరిపే కౌంటర్‌లకు తరలించాలని ఆ విభాగం అధికారులను ఆదేశించారు. దేవాలయ పరిశరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని శానిటేషన్ విభాగం అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ప్రధాన దేవాలయ, ఉపాలయాలు, కాటేజీలు, కేశఖండన శాల, డార్మెటరీలు, మరుగుదొడ్లుకి వెళ్లే ప్రాంతాలను సూచిస్తూ సూచిన బోర్డులు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేదికపై వేంజేంపజేశారు.

విశేషంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

కబ్జా చేస్తే ఖబడ్దార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: 'నియోజకవర్గంలో భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి. నా పేరు, ఇతర నాయకుల పేర్లు చేప్పుకుని ప్రభుత్వ భూములు, నిర్మాణాలు చేపడుతున్నారని మా దృష్టికి వచ్చింది. ఎట్టి పరిస్థితిలోనూ ప్రభుత్వ భూముల దురాక్రమణలను సహించం. జీవీఎంసీ పరిధిలో అనధికారిక నిర్మాణాలను ఉపేక్షించం ..మా పేర్లు చెప్పుకుని కబ్జాలకు, అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకునేందుకు సబంధిత ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం' అంటూ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. శనివారం సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో పంచకర్ల మాట్లాడుతూ ఇటీవలకాలంలో భూ కబ్జాలు పెరిగినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తన పేరు, ఇతర నాయకుల పేర్లు చెప్పుకుంటూ భూ కబ్జాలకు, జీవీఎంసీ పరిధిలో అనధికారిక నిర్మాణాలకు పాల్పడుతున్నట్లు తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. అయితే ఏ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు, ఇతరులెవరైనా కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి 94 వినతులు వచ్చాయి. ఆయా సమస్యలను తర్వతగతిన పరిష్కరించేలా చూస్తామని ఎమ్మెల్యే అర్జీదారులకు భరోసా ఇచ్చారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఇరువాడలో చోరీ

సబ్బవరం: మండలంలోని ఇరువాడ ఎస్సీ కాలనీకి చెందిన గొటివాడ దేవుడమ్మ ఇంట్లో రూ.80 వేల నగదు, మూడు తులాల బంగారు అభరణాలు శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయని సబ్బవరం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలివి.. దేవుడమ్మ కుమార్తెతో కలసి గ్రామంలో నివసిస్తున్నారు. అదే వీధిలో ఆమె కుమారుడు సంతోష్ భార్య, పిల్లలతో కలిసి వేరే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆటో డ్రైవర్ అయిన సంతోష్ శుక్రవారం విజయనగరం జిల్లాకి బాడుగ ఆటో వేసుకుని వెళ్లడంతో దేవుడమ్మ, కుమార్తెతో కలసి కుమారుడి ఇంటి వద్ద ఉండిపోయింది. శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో దేవుడమ్మ తమ ఇంటికి వెళ్లి చూడగా లోపల గదికి ఉన్న తలుపు, తాళంతో పాటు లోపలున్న బీరువా విరగ్గొట్టి ఉన్నాయి. అందులో నగదు, 3 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించి, ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గండి రవికుమార్

పరవాడ: మండలంలో రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామంలో దుర్గమాంబ నూతన ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పెందుర్తి నియోకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శనివారం పాల్గొన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కోన రామారావు, గ్రామ పెద్దలు కె.ఎస్.ఎ.రామయ్యనాయుడు, కావలి వాసు, పల్లా గోవిందు, బుగిడి రామగోవిందరావు, మంత్రి గిరిప్రసాద్, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

పర్యావరణ హితమే లక్ష్యం

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- 'స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర' కార్యక్రమాల్లో వక్తలు

పెందుర్తి: పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ప్రకృతికి మేలు చేసే వస్తువులను వినియోగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని కార్యాలయాల్లో, విద్యాలయాల్లో శనివారం నిర్వహించారు.

- జీవీఎంసీ ఆధ్వర్యంలో 96వ వార్డు పెందుర్తి జూనియర్ కళాశాల వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించి, పర్యావరణానికి మేలు చేసే నూలు, వస్త్ర సంచులు వాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్సీ కె.హేమావతి, తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్, ఎంపీడీవో కె.వెంకట్రావు, రైతుబజార్ ఈవో పద్మావతి షర్మిల పాల్గొన్నారు.
- పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు.
- 95వ వార్డులో కార్పొరేటర్ ముమ్మన దేముడు మొక్కలు నాటారు. శ్రమదానం చేశారు.
- 97వ వార్డులో శానాపతి వసంత పారిశుధ్య నిర్వహణ,ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కలిగించారు.
- మండలంలోని రాంపురంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేపట్టారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, అంగన్‌వాడీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో..

పరవాడ: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మండలంలోని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, వెన్నలపాలెం, పరవాడ, తానాం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో నిర్వహించారు. వాడచీపురుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పరవాడ మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ రహిత జీవితానికి పంచ సూత్రాలను పాటించాలన్నారు. గ్రామ, పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, పరవాడ మాజీ ఎంపీపీ ఎం.అప్పలనాయుడు, పంచాయతీ సర్పంచ్ శివలంక లక్ష్మి, కార్యదర్శి అచ్యుతరావు, పరవాడ పంచాయతీ కార్యదర్శి మురళీధర్ పట్నాయక్, వెన్నలపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.భారతి, ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు, నాయుడుపాలెం పంచాయతీ సర్పంచ్ కె.వరలక్ష్మీసీతారామయ్య, కార్యదర్శి త్రినాథ్, ముత్యాలమ్మపాలెంలో సర్పంచ్ సిహెచ్.సుజాత, పంచాయతీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహగిరిపై..

సింహాచలం: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింహగిరిపై దేవస్థానం ఉద్యోగులు, సిబ్బందితో ఆలయ రాజగోపురం వద్ద ఈవో కె.సుబ్బారావు ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి ఇచ్చిన సంపదను ప్రతి ఒక్కరం పరిరక్షించుకుందామన్నారు. ప్లాస్టిక్ పాత్రల్లో ఆహారం హానికరమని తెలిపారు.

మట్టి, పింగాణి, స్టీల్ పాత్రల్లో వండటం మంచిదని తెలియజేశారు. స్వచ్ఛత అనేది నాగరికతకు, సంస్కృతికి ప్రతిబింబమన్నారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈ శ్రీనివాసరాజు, ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, శానిటేషన్ పర్యవేక్షణ అధికారిణి రాజ్యలక్ష్మి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం హైస్కూల్లో..

సబ్బవరం: పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించే విధంగా పాఠశాలలోని విద్యార్థులను సమాయత్తం చేయాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. సబ్బవరం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేశారు. ఎంఈవో రవీంద్రబాబు, హెచ్ఎం తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెందుర్తిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



రాంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు



97వ వార్డులో పారిశుధ్యంపై అవగాహన కలిగిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత



పోలీస్ స్టేషన్‌లో శ్రమదానంలో పాల్గొన్న సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది



సింహగిరిపై ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న దేవస్థానం ఈవో సుబ్బారావు



వాడచీపురుపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ స్కూల్ హెచ్ఎం సన్యాసిరావు, విద్యార్థులు



సబ్బవరం హైస్కూల్ పరిసరాలను శుభ్రం చేస్తున్న డీఈవో అప్పారావు నాయుడు, ఉపాధ్యాయులు

ఘనంగా ఎల్లమ్మతల్లి పండగ



సింహాచలం: అడవివరంలోని శిడగంపేటలో కొలువుదీరిన ఎల్లమ్మతల్లి వార్షిక పండగ శనివారం ఘనంగా జరిగింది. అమ్మవారిని గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. పండగను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీప కాంతులతో విశేషంగా అలంకరించారు.

సబ్బవరంలో ఇసుక స్టాక్ యార్డ్ లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : తూర్పుగోదావరి, శ్రీకాకుళం జిల్లాలోని ఇసుకరీచ్‌ల నుండి ఇసుకను జిల్లాలోని సబ్బవరం మండలంలో నిల్వ కేంద్రం వద్దకు రవాణా, నిల్వ చేసి, నిల్వ కేంద్రం నుండి వాహనాల్లో లోడ్ చేయడానికి లాటరీ పద్ధతిన దరఖాస్తులు కోరతున్నట్టు కలెక్టర్, జిల్లా ఇసుక కమిటీ చైర్‌పర్సన్ విజయకృష్ణన్ తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున తక్కువ మొత్తంలో ఇసుక కావలసిన వినియోగదారులు ఇసుక డిపో ద్వారా ఇసుక సరఫరా చేయు నిమిత్తం ప్రైవేట్ వ్యక్తులకు మినరల్ డీలరు లైసెన్స్ ఇవ్వనున్నట్టు తెలిపారు. టన్ను అమ్మకం ధర రూ.958 ప్రకారం అమ్మకాలు జరపడానికి, వాహనాలు వచ్చి వెళ్లడానికి సరైన మార్గం గల ప్రైవేట్ స్థలం 4 ఎకరాలు (లీజు, సొంతం) కలిగి ఉన్న వ్యక్తులు మినరల్ డీలరు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రభుత్వం వారి విధి విధానాలకు లోబడి పైన పేర్కొన్న ధరకు మాత్రమే ఇసుకను విక్రయించాలని, స్టాక్ యార్డ్‌లు ఏర్పాటు చేయడానికి రెండేళ్ల ఇసుక యార్డ్ నిర్వహణ అనుభవం కలిగిన ఆసక్తి గల వ్యక్తులు మినరల్ డీలరు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారికి ఫోన్ నంబర్ 9100688822ను సంప్రదించాలని తెలిపారు.